# మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు





మట్టిని తీస్తున్న జేసీబీ యంత్రం , టిప్పర్‌ను అడ్డుకొని ఆందోళనకు దిగిన గ్రామస్తులు

### - యంత్రాలను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

**భీమదేవరపల్లి, ఆగస్టు 17 (ప్రభన్యూస్)** అక్రమంగా మట్టిని ఇతర ప్రాంతాలకు టిప్పర్ ల ద్వారా తరలిస్తూ డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలకు గురైన గ్రామస్తులు అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మట్టి తవ్వకాలను అడ్డుకొని యంత్రాలను సీజ్ చేసిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మక్త నాయక్ తండా వద్ద ఇటీవల మట్టి తవ్వకాలను ప్రారంభించారు. భారీ యంత్రాల సహాయంతో మట్టిని వెలికితీస్తూ టిప్పర్ల ద్వారా ప్రతినిత్యం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే గట్లనర్సింగాపూర్ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్ల వద్ద నుండి వాహనాలు అతివేగంతో వెలుతుండటంతో ప్రజలు రోడ్డుపై నడిచే పరిస్థితి లేకుండా పోయింది. ఇటీవల డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ఒక ప్రమాదం త్రుటిలో తప్పిపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు శనివారం మట్టి తవ్వకాలను అడ్డుకొని బాధ్యులతో వాగ్వివాదానికి దిగడం జరిగింది. దీంతో రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు సంఘటన స్థలికి చేరుకొని మట్టిని వెలికి తీస్తున్న భారీ వాహనాన్ని సీజ్ చేయడం జరిగింది. దీనిపై తహసిల్దారుని వివరణ కోరగా ప్రభుత్వ భూమిలో మట్టి తీయడం నిషేధమని అలాగే పట్టా భూముల్లో సైతం ఒక ఫీట్ మట్టి తీసేందుకు మాత్రమే పట్టాదారునికి అనుమతి ఉందని అంతకుమించి తీస్తే చట్ట విరుద్ధమని ఆయన తెలిపారు. అనుమతి లేకుండా మట్టి తవ్వకాలను జరుపుతున్న అక్రమార్కులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇది ఇలా ఉండగా గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన బిజెపి మండల శాఖ అధ్యక్షులు పృథ్వీరాజ్ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న సహజ వనరులను అక్రమంగా కొల్లగొడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# జూనియర్ డాక్టర్‌ను హత్యచేసినవారిని శిక్షించాలి

### నేదునూరి జ్యోతి



కాళోజీ సెంటర్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న నేదునూరి జ్యోతి

**వడ్డేపల్లి, ఆగస్టు 17 (ప్రభన్యూస్)** కోలకత్తాలోని ఆర్‌జీఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో పీజీ రెండవ సంవత్సరం చదువుతున్న వైద్యవిద్యార్థిని హింసించి అత్యాచారం చేసిహత్యచేసిన నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ కాళోజీ సెంటర్‌లో భారత జాతీయ మహిళా సమాఖ్య హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల రమ అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలకు రోజురోజుకు భద్రత కరువైందని పాలకులపై ధ్వజమెత్తారు. వైద్యవిద్యను అర్జించే విద్యార్థికే రక్షణ లేదంటే...సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.తక్షణమే కేంద్ర, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జోక్యంచేసుకొని అసలైనదోషులను గుర్తించి శిక్షవిధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దీన, మమత, అనిత, వీరలక్ష్మీ, స్వరూప, కనకలక్ష్మీ, గట్టమ్మ, సుజాత, రాజమ్మ తదితరులు ఉన్నారు.

**అంబేద్కర్ సెంటర్‌లో...**

మెడికో విద్యార్థి అత్యాచారం ఘటనపై పశ్చిమ బెంగాల్‌లోని తృణమూర్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంచేస్తుందని హనుమకొండ జిల్లా సీపీఎం కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. పీజీ వైద్యురాలిని హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యవిద్యార్థినిది మొదట ఆత్మహత్య అంటూ బాధిత కుటుంబసభ్యులకు ఫోన్ చేసిన కళాశాల యాజమాన్యం తర్వాత పొంతన లేని సమాధానాలు చెప్పారన్నారు. పోస్టుమార్టం రిపోర్టులో హత్యాచారం ఎక్కువ మంది చేసినట్లు వచ్చిందని గుర్తుచేశారు. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకుంటే ఎలా.. అని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకట్, రాములు, నాయకులు వీరన్న, సాంబయ్య, కుమార్, రాజు, రాజేందర్, రమేష్, పద్మ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 21న జాబ్ మేళా

### - జిల్లా ఉపాధి అధికారి ఎం. మల్లయ్య

**హన్మకొండ కలెక్టరేట్, ఆగస్టు 17 (ప్రభన్యూస్)** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఈనెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం మల్లయ్య తెలిపారు. హైదరాబాద్‌లో పని చేసేందుకు జ్యోషిత రియల్ ఎస్టేట్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, జ్యోతి ఎంటర్ ప్రై జెస్‌లో వాటర్ ప్యూరిఫయర్ టెక్నిషియన్స్ 90 ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత బైక్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి 18 నుంచి 25 సంవత్సరాలు ఉండి ఎస్సెస్సీ, ఇంటర్ , డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణులైన యువకులు అర్హులని తెలిపారు. అర్హత ఆసక్తి గల యువకులు తమ బయోడాటాతో పాటు, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఆరోజు ఉదయం 11 గంటలకు ములుగురోడ్డు వద్దనున్న ఐటీఐ ప్రాంగణంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో జరుగు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. మొబైల్ నెంబర్ 7893394393లో సంప్రదించాలని డీఇవో మల్లయ్య సూచించారు.

# హసన్‌పర్తి సీఐ చేరాలుకు అభినందనలు



సీఐ చేరాలును సన్మానిస్తున్న దృశ్యం

**హసన్‌పర్తి, ఆగస్టు 17 (ప్రభన్యూస్)** హసన్ పర్తి నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ వి చేరాలుకు శుభాకాంక్షలు తెలియజేసి, అభిందించిన కాంగ్రెస్ నాయకులు. శనివారం హసన్ పర్తి మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐ ని కలిసి శాలువాతో సన్మానించారు.ఆ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు తంగళ్ళపల్లి తిరుపతి,మహిళా మండల అధ్యక్షురాలు జోరుక పూల. మడిపల్లి మాజీ సర్పంచ్ విజయ్. రేణిగుంట్ల అశోక్, మాజీ ఉపసర్పంచ్ బల్సుకూరి శ్రీనివాస్, 65 డివిజన్ ఎస్సిసెల్ అధ్యక్షులు పోలేపాక అశోక్, కోడెపాక రాజు మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అన్వర్, వట్టే బుచ్చిరెడ్డి, చందరాజు సంతోష్, గట్ల సాంబయ్య నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురంలో మెటల్ రోడ్డు వేయించిన కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్

**ఖిలావరంగల్, ఆగస్టు 17 (ప్రభన్యూస్)**: వరంగల్ నగరంలోని 43వ డివిజన్ లక్ష్మీపురంలో రోడ్డు బురదమయంగా ఉండడంతో వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్ నాగరాజు ఆదేశాల మేరకు శనివారం స్థానిక కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ కొబ్బరికాయ కొట్టి మెటల్ విత్ మిక్స్‌డ్ రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు వేయించినందుకు లక్ష్మీపురం ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా కార్పొరేటర్ ను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు కుమారస్వామి, వడ్డేపల్లి బాబు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# ఆత్మకూర్ సొసైటీలో ఆకస్మిక తనిఖీలు

**ఆత్మకూర్, ఆగస్టు 17 (ప్రభన్యూస్)** వ్యవసాయ సహకార సంఘం ఆత్మకూరులో సొసైటీలో జరిగిన అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ తో పాటు సిబ్బంది రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని సొసైటీ డైరెక్టర్లు నత్తి సుధాకర్, రేవూరి జయపాల్ రెడ్డి, కంచె సతీష్ జిల్లా ఉన్నతాధికారులకు శుక్రవారం ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. నోడల్ అధికారి విజయ్ భాస్కర్ రెడ్డి, జిల్లా అధికారుల సిబ్బంది రికార్డులను పరిశీలించి, రైతులను విచారించి, డైరెక్టర్లతో మాట్లాడి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఇక్కడ జరిగిన విష యాలన్నీ ఉన్నతాధి కారులకు సమాచారం అందజేస్తామన్నారు.

# ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

### బొనగాని యాదగిరిగౌడ్

**వడ్డేపల్లి, ఆగస్టు 17 (ప్రభన్యూస్)** తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా, గ్రామగ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్ శనివారం ఒకప్రకటనలో తెలిపారు. ఆగస్టు 18న సర్వాయిపాపన్నగౌడ్ జయంతిరోజున సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని, ఆయన జీవిత చరిత్రను భావితరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాల్లో లిఖించాలని కోరారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం జరిగే పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుక లకు అన్ని జిల్లాలోని గౌడ కులస్తులు, బహు జనులు, మేధావులు హాజరుకావాలని యాదగిరి గౌడ్ పిలుపు నిచ్చారు.



బొనగాని యాదగిరిగౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

# అమెరికాలో మృతి చెందిన ఏరుకొండ రాజేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

**ఆత్మకూర్, ఆగస్టు 17 (ప్రభన్యూస్)** ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఏరుకొండ రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవురు ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ రాజేష్ గత నాలుగు రోజుల క్రితం అమెరికాలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దేవుడి ప్రకాష్ రెడ్డి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అమెరికా నుంచి ఏడుకొండ రాజేష్ మృతి దేహాన్ని ఆత్మకూరుకు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే నివాసం నుంచి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ మీరు ఎవరు అధైర్య పడవద్దని ముఖ్యమంత్రి అండతో విదేశాలలో పోస్టుమార్టం పూర్తి చేయించామన్నారు. నీ కుమా రుని నీకు అప్పజెప్పి నీ కుటుంబానికి మేము అండగా నిలుస్తామని మృతిని తల్లి ఏరుకొం డ నీలమ్మకు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఓదార్చారు. విదేశాలకు ఉన్నత చదువులకు వెళ్లి ఏరుకొండ రాజేష్ విగత జీవిగా తిరిగి రావడం చాలా బాధాకరమని ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు మొద్దు ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


**శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం : 501, సల్‌కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ - 110025
సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్‌సి366027

**వేలం ప్రకటన**

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికీ వారిచే సర్దుబాటు చేయబడ లేదు రుణగ్రహీతలందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలుపొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా **28.08.2024న మ॥03.00గం॥లకు** వేలం తేదీగా నిర్ణయించబడినది. రుణగ్రహీత లతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

| శాఖ | ఖాతా నెం. | ఖాతాదారుని పేరు | తండ్రి/ భర్త లేదా భార్య పేరు | చిరునామా | ఖాతా తెరచిన తేది | చెల్లించవలసిన మొత్తం |
|---|---|---|---|---|---|---|
| జూబ్లీహిల్స్ | 103942511123 | చిలుకల సందీప్ | తండ్రి చిలుకల చిన్నపురెడ్డి | ఇంటి నెం.12-42, నిడిగొండ, రఘునాథపల్లి మండలం, వరంగల్, తెలంగాణ -506244 | 16/04/2024 | 544039.08 |

**వేలం తేది : 28.08.2024న మ॥03.00గం॥లకు**

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.

సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్